


# నయనతారతో పెళ్లి నా కల..

## దుమారం రేపిన అన్నాడిఎంకె ఎంపి వ్యాఖ్యలు

### తమిళ చిత్రసీమ వర్గాల ఆగ్రహం

**చెన్నై, మార్చి 17:** తమిళనాడులో ఎన్నికల షెడ్యూల్ రావడంతో రాష్ట్రంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. ప్రత్యర్థులను విమర్శించే క్రమంలో కొందరు నాయకులు తమ నోటికొచ్చింది మాట్లాడి వివాదాల్లో నిలుస్తున్నారు. విల్లుపురంలో డీఎంకే ప్రభుత్వంపై నిరసన సభలో ముఖ్యమంత్రి కొత్త పథకాన్ని అన్నాడీఎంకే ఎంపీ, మాజీ మంత్రి షణ్ముగన్ విమర్శించారు. ఎన్నికల సందడి మొదలవ్వడంతో తమిళనాడులో అధికార డీఎంకే పార్టీని టార్గెట్ చేశాయి విపక్షాలు. ఎన్నికల తేదీ రావడంతో ఓటర్లను ఆకర్షించాలనే ఉద్దేశంతో మీ కలలు చెప్పండి. మేము నెరవేరుస్తాం అని సీఎం స్టాలిన్ కొత్త పథకాన్ని ప్రకటించారు. అయితే ఈ పథకంపై అన్నాడీఎంకే నాయకులు సెటైర్లు వేస్తున్నారు. అంతటితో ఆగకుండా నాకు నయనతార కావాలి. నా కోరిక నేరవేరుస్తారా. నయనతారను పెళ్లి చేసుకోవాలని కోరుకునేవాళ్ల కలను సీఎం నిజం చేస్తారా అని ఎంపి షన్ముగంచేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని డీఎంకే నేతలు, దక్షిణాది చిత్రసీమ వర్గాలు సహా పలువురు ఖండించారు. డీఎంకే అధికార ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హాఫీజుల్లా ఎంపీ షణ్మగన్ వ్యాఖ్యల్ని తప్పుపట్టారు. మా పార్టీ విధానాలను విమర్శించండి. అంతేతప్ప మహిళలపై అసభ్యకరమైన కామెంట్లు చేయకండి. నయనతారను అవమానపరచడం ద్వారా మొత్తం మహిళలను ఎంపీ అవమానించారు. సభ్యతగల సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలు అంగీకారం కాద్దు అని పేర్కొన్న సయ్యద్ అన్నాడీఎంప పార్టీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# భువనగిరి ఎంపి చామల కిరణ్‌పై లోక్‌సభలో సస్పెన్షన్ ఎత్తివేత

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** లోక్‌సభలో యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న ఇంధనం ఇబ్బందులపై గొంతు ఎత్తినందుకు లోక్‌సభ స్పీకర్ సస్పెండ్ చేసిన భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు మంగళవారం ఎత్తివేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు 8 మంది కాంగ్రెస్ లోక్ సభ సభ్యుల సస్పెన్షన్ ఎత్తివేశారు. లోక్ సభ స్పీకర్ సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత ఆ ఎనిమిది మంది ఎంపిలు గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. సభలోకి ప్లకార్డులు తేవద్దు,వెల్ లోకి రావద్దని స్పీకర్ వారిపై ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ అంశంపై మాట్లాడుతూ సభను డిస్టబ్ చేయాలని మేము అనుకోవడం లేదు ఎన్నో ఆశలతో మమ్మల్ని ప్రజలు పార్లమెంట్ కు పంపించారనీ అన్నారు. లోక్ సభ స్పీకర్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలనీ డిమాండ్ చేశారు. ఎల్పిజి అమెరికా టారిఫ్స్ పై సభలో చర్చ చేపట్టాలనీ సూచించారు. సభలో ప్రజా సమస్యలపై చర్చకు స్పీకర్ అనుమతి ఇవ్వాలనీ కోరారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడేటప్పుడు అడ్డు తగలకుండా స్పీకర్ చర్యలు తీసుకోవాలనీ అన్నారు. సభ సజావుగా జరగాలని మేము కోరుకుంటున్నామనీ చెప్పారు.

# రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి మారిషస్ సహకారం

## ఆ దేశ అధ్యక్షుడితో రైతు కమిషన్ బృందం భేటీ

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** మారిషస్ దేశ సహకారంతో తెలంగాణలో పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర టూరిజం ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి అన్నారు. ఈ మేరకు మారిషస్ దేశ అధ్యక్షడు ధరం గోకుల్‌ను హైదరాబాద్‌లో మంగళవారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయరంగంలో ఆధునిక సాంకేతికతల వినియోగం, పెట్టుబడుల అవకాశాలు, పరస్పర సహకారంతో చేపట్టే అవకాశమున్న ప్రాజెక్టులపై చర్చించారు. పర్యాటకం, వ్యవసాయరంగాలకు చెందిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో మారిషస్ తెలుగు మహా సభ అధ్యక్షులు హెవిన్ గురయ్యా, సమన్వయకర్త విశ్వకర్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పౌల్ట్రీ రంగంలో విస్తృత సహకారమే లక్ష్యంగా

# వెంకటేశ్వర హాచరీస్‌తో టైసన్ ఫుడ్స్ చర్చలు

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** పౌల్ట్రి రంగంలో విస్తృత సహకారం ప్రాతిపదికగా వెంకటేశ్వర హెచరీస్(విహెచ్) –పూణెతో అమెరికాకు చెం దిన ప్రపంచస్థాయి అగ్రశ్రేణి సంస్థ టైసన్ ఫుడ్స్ కీలక చర్చలు జరిపింది. పౌల్ట్రిరంగంలో పరస్పర సహకారానికి రెండు సంస్థలు ఓ అంగీకారానికి వచ్చాయి. ఈ మేరకు ఫిబ్రవరి నెల మూడోవారంలో విహెచ్ గ్రూప్‌ను టైసన్ ఫుడ్స్ ముఖ్య ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా పౌల్ట్రి రంగంలో ద్వైపాక్షిక సంబంధాన్ని బలోపేతం చేసుకోవాలని ఇరు సంస్థలు నిర్ణయించాయి. ఈ చర్చల్లో టైసన్ ఫుడ్స్ ప్రతినిధి జాన్‌ఆర్‌టైసన్, బోర్డు డైరెక్టర్లు విలియం సావిర్, ఏసియా పసిఫిక్ వ్యవహారాల ప్రతినిధి రాయ్ పాల్గొని విహెచ్ గ్రూప్‌తో కీలక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో పౌల్ట్రి పరిశ్రమ, మార్కెట్ పరిస్థితులు, సాంకేతిక ఆవిష్కరణలు, ఈ రంగంలో స్థిరమైన వృద్ధి అవకాశాలపై చర్చలు జరిగాయి.

## కుటుంబనియంత్రణ ప్రోత్సాహక ఇంక్రిమెంట్‌ను

# రద్దు చేసిన ఆర్టీసీ యాజమాన్యం

## సంస్థ యూనియన్‌ల ఆగ్రహం

## సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ఆర్టీసీ)లో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న కుటుంబ నియంత్రణ ప్రోత్సాహక ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ ఆర్టీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను ఆర్టీసీ మంగళవారం జారీ చేసింది. కుటుంబ నియంత్రణ ప్రోత్సాహకాన్ని రద్దు చేయడం పట్ల ఆర్టీసీలోని యూనియన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి ఏపీఎస్ఆర్టఈసీలోను, టిజిఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి కొనసాగుతున్న ఫ్యామిలీ ప్లానింగ్ ప్రోత్సాహక ఇంక్రిమెంట్‌ను టిజిఎస్ఆర్టీసీ యాజమాన్యం రద్దు చేస్తూ మంగళవారం సర్క్యులర్ విడుదల చేయడాన్ని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటియు) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది.

తక్షణమే సర్క్యులర్ నెంబర్ 10/2026ను రద్దుచేసి ఫ్యామిలీ ప్లానింగ్ ప్రోత్సాహక ఇంక్రిమెంట్‌ను పునరుద్దరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.ప్రభుత్వం 2001 లో విడుదల చేసిన మార్గదర్శకాల పేరుతో 25 సంవత్సరాల తర్వాత బోర్డు నిర్ణయం పేరుతోరద్దు చేయడం కార్మికులకు అన్యాయం చేయడమేనని, ఇది సరైంది కాదని, తక్షణమే సర్క్యులర్‌ను నిలిపి వేయాలని రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు డిమాండ్ చేశారు.

సుమారు మూడు దశాబ్దాలుగా ఇస్తున్న కుటుంబ నియంత్రణ ప్రోత్సాహక ఇంక్రిమెంట్‌ను ఆర్టీసీ యాజమాన్యం ఏకపక్షంగా రద్దు చేయడానికి టిజిఎస్ఆర్టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది.

# తెలంగాణ ఉద్యమకారులకు సముచిత న్యాయం చేస్తాం

## శాసన మండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారులకు సముచిత న్యాయం చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసన మండలిలో మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా బిఆర్ఎసన ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలంగాణ అమరవీరుల గురించి మాట్లాడగా.. అందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ఇచ్చారు. గత 10 సంవత్సరాలుగా పరిపాలించిన ప్రభుత్వం అమరవీరుల పట్ల, తెలంగాణ ఉద్యమకారుల పట్ల వారి చిత్తశుద్ధి ఉద్యమకారులందరికీ తెలుసునని, తాము వారి ఆకాంక్షను నెరవేర్చే దిశగా తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమకారులుగా తాను, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా విధివిధానాలు ఖరారు చేసేలా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమ కారులకు సముచిత న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. మమ్మల్ని అడిగే ముందు 10 సంవత్సరాలుగా మీరేం చేశారో జవాబు చెప్పాలని ప్రశ్నించారు. అమరవీరులకు సంబంధించి గత 10 సంవత్సరాలుగా ఏం చేశారని.. స్వయంగా వారి కుటుంబ సభ్యురాలు విమర్శిస్తున్నారని గుర్తు చేశారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి తెలంగాణ గీతాన్ని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు గుర్తించలేదన్నారు. ఇదే మా తెలంగాణ తల్లి విగ్రహం అని చట్టం ఎందుకు చేయలేదని, తాము ఏమైనా అడ్డుకున్నామా? అని ప్రశ్నించారు. అందరినీ సంప్రదించిన తర్వాత తెలంగాణ తల్లి రూపాన్ని గ్రామీణ ప్రాంత మహిళను ప్రతి బింబించేలా ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి సెక్రటేరియట్ గుండెల్లో పెట్టుకున్నామన్నారు. పేద ప్రజలు .. కులాలకు అతీతంగా ఆదుకుని జరుపుకునే బతుకమ్మ టిఆర్ఎస్ పేటెంట్‌లాగ మాట్లాడుతున్నారని. ఇది మీ పేటెంట్ కాదు..పేద ప్రజలకు సంబంధించిన అంశమన్నారు. బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం చట్టం చేశామని, అది కేంద్రం పరిధిలో ఉందని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయడానికి ఇప్పటికీ సీరియస్‌గా ఉన్నామని మంత్రి పొన్నం శాసన మండలిలో స్పష్టం చేశారు. మీరు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో పాల్గొనకుండా, రిజర్వేషన్లు అడ్డుకునే ప్రయత్నం చేశారని, కానీ తాము చట్టం చేశామని, గవర్నర్ ద్వారా బిల్లు రాష్ట్రపతి దగ్గరకు పోయిందని మంత్రి గుర్తు చేశారు. సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని, బలహీన వర్గాలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. బలహీన వర్గాల రిజిస్ట్రేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడుదాము రండి అంటే మీరు రాలేదని ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.

# రైతులే కూరగాయల సాగు అభివృద్ధికి మార్గదర్శకులు

## వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణం పెంచాలని, అందుకు రైతులే మార్గదర్శకులుగా ముందుండాలని తెలంగాణ వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ పిలుపునిచ్చారు. కూరగాయల సాగు విస్తీర్ణం పెంపును ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. దశల వారీగా ఎంపిక చేసిన రైతులకు కూరగాయల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలు, చిన్న పనిముట్లను ప్రభుత్వం సబ్సిడిపై అందజేస్తుందని చెప్పారు. ఈ మేరకు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుండి ఎంపిక చేసిన వెజిటబుల్ వలంటీర్లకు కూరగాయల సాగుపై మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 1 లక్ష హెక్టార్లలో మాత్రమే కూరగాయలు సాగవుతున్నాయని, రానున్న అయిదేళ్లలో 5 లక్షల హెక్టార్లకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతుల ఆదాయం పెంపే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 950 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయని, ప్రత్యేకించి హైవేలపై ప్రతి 50 కిలోమీటర్లకు ప్రభుత్వ భూములలో ఒక మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు పండిస్తున్న రైతులకు ప్రభుత్వం నుండి ఆర్గానిక్ సర్టిఫికేషన్ అందించి, వారిని ప్రోత్సహించడమే కాకుండా వారి ఉత్పత్తులకు సరైన ధరలు లభించేలా మార్కెటింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తామని తెలిపారు. కూరగాయల అవసరాలు, డిమాండ్ సరఫరాపై ప్రతి గ్రామంలో చర్చ జరగాలని, అప్పుడే సాగు విస్తీర్ణం పెరుగుతుందని ఉద్యాన విశ్వవిద్యాలయం విసి డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు.

# రాజకీయ దురంధరుడు ఓంకార్

## విలువలకు కట్టుబడిన నేత

## శత జయంతి వేడుకలో మంత్రి సీతక్క

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మార్చి 17, ప్రభాతవార్త :** ఆరు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా అత్యున్నత రాజకీయ విలువలు అద్దిన దురంధరుడు మద్దికాయల ఓంకార్ చిరస్మరణీయుడని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గిరిజన మహిళా శిశుసంక్షేమశాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రజా ఉద్యమాల్లో విశేషపాత్ర పోషించిన ఓంకార్ అండర్‌గ్రౌండ్ నుండి ఓవర్‌గ్రౌండ్ వరకు ఆయన సాగించిన పోరాటం అపారం, అనితరసాధ్యమని తన రాజకీయ ప్రస్థానంలో ఆయన్నుంచి క్రమశిక్షణ, ప్రజాసేవ, ఉద్యమవిలువలు నేర్చుకున్నానని, ఆయనలాగే తుపాకీ పట్టాను, తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకొచ్చి ఎమ్మెల్యే అయ్యానని తెలిపారు.

ఎంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ కమిటీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి సభాధ్యక్షతన జరిగిన అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవం సందర్భంగా చట్టసభలలో ఓంకార్ పాత్ర అంశంపై జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సీతక్క ముందుగాయ ఓంకార్ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి ప్రసంగించారు. ఓంకార్ లేనిలోటు నర్సంపేటకే కాదు యావత్ తెలంగాణకే పూడ్చలేని లోటు అన్నారు. ప్రజాసమస్యలపై చట్టసభల్లో ప్రజాగళం వినిపించిన నిస్వార్థ ప్రజాసేవకుడని కొనియాడారు. ఓంకార్‌ను రాష్ట్ర ప్రజలు ఎల్లకాలం గుర్తుంచేకునేలా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలన్న ఆకాంక్షను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఏర్పాటుకు తనవంతు సంపూర్ణ సహాయసహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. గత రెండేళ్లలో మహిళాసంఘాలకు బ్యాంకుల ద్వారా 57వేల కోట్ల రుణాలు ఇచ్చామని, మహిళా సంఘాలపై ఉన్న వడ్డీ భారాన్ని కూడా ప్రభుత్వం భరిస్తోందని గుర్తుచేస్తూ... మహిళా సంఘాలకు 57వేల కోట్ల బ్యాంకు ఋణాలిస్తే రాజీనామా చేస్తానన్న కెటిఆర్ అన్నారని, తన మాటకు కట్టుబడి వెంటనే రాజీనాయా చేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 1390 కోట్ల వడ్డీ చెల్లించామని, ఇందుకు సంబంధించిన ఆధారాలు బయటపెట్టానని, కెటిఆర్ లెక్కలు సరిచూసుకోవాలని సవాల్ విసిరారు.

అనంతరం ఎంసిపిఐ(యు) అఖిలభారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ చట్టసభల్లో ప్రజాసమస్యలపై ప్రశ్నించేవారే కరువయ్యారని, రాజకీయాలను వ్యాపారదృష్టితో చూసేవారి సంఖ్య పెరిగిపోయిందని వాపోయారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క, ఎం.అశోక్ ఓంకార్, జి.రవి, కె.సాంబశివరావు, రాఘవులు, వనం సుధాకర్, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

ఓంకార్ ప్రజాసమస్యలపై ప్రశ్నించేవారు కాబట్టి అసెంబ్లీ టైగర్‌గా ప్రజలు అభివర్ణించుకున్నారని తెలిపారు. సిపిఎం పోలిస్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అసమానతల రాజకీయాలపై, ఆర్థిక అంశాలపై, రాజకీయాలకు వన్నెతెచ్చిన ఓంకార్ స్ఫూర్తితో పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని, ఓంకార్ వామపక్ష ఐక్యత కోసం చేసిన కృషితో పనిచేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ శాసనసభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఓంకార్ చట్టసభలను వేదిక చేసుకుని ప్రజాసమస్యలపై పోరాటాలు చేశారని, ఆలాంటి పోరాటాలు చట్టసభల్లో మావైపు నుండి చేయడానికి ఓంకార్ స్ఫూర్తి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి నరసయ్య, ఎమ్మెల్సీ సత్యం, జె.వి.చలపతిరావు, గుర్రం విజయ్‌కుమార్, జస్టిస్ చంద్రకుమార్, సంఘ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వనం సుధాకర్, సిహెచ్.మురారి, మర్రెడ్డి వెంకటరెడ్డి, ఎస్.చంద్రశేఖర్, ఉపేంద్రరెడ్డి, చందర్రావు, చెరుకు సుధాకర్, సంఘ కేంద్ర రాష్ట్ర నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఓంకార్ కుటుంబసభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో రూ. కోటి దోపిడీని ఛేదించిన పోలీసులు

## 24 గంటల్లోనే నిందితుల అరెస్ట్

## 77 లక్షల స్వాధీనం.. హవాలా నగదుపై అంతర్గత కుట్ర వెలుగులోకి

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), మార్చి 17, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన రూ. కోటి దోపిడీ కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. కూకట్‌పల్లి పోలీసులు, సీసీఎస్ బాలానగర్ బృందాల సమన్వయంతో 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేసి, దోపిడీ సొమ్ములో భాగంగా రూ.77,78,195 నగదును స్వాధీనం చేసుకున్నారు. బహదూర్‌పురాకు చెందిన మహ్మద్ అజీముద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అతడు తన సహచరుడు మహ్మద్ ఖుస్రుద్దీన్‌తో కలిసి వివిధ వ్యక్తుల వద్ద నుంచి హవాలా రూపంలో నగదు సేకరించే పనులు నిర్వహిస్తుంటాడు. ఈ ప్రక్రియలో టోకెన్‌గా రూ.10 నోటు చూపించి నగదు స్వీకరించే విధానం కొనసాగుతోంది.

ఈ నేపథ్యంలో ఖుస్రుద్దీన్‌కు ఆ నగదు అక్రమమని తెలుసుకొని దానిని దోచుకోవాలని పథకం వేసుకొని డ్రైవర్‌గా పనిచేస్తున్న ఒమర్ షరీఫ్‌తో సంప్రదించి డబ్బు కొట్టేయాలని పన్నాగం వేశాడు. అనంతరం సద్దాం, హమీద్‌తో పాటు మరికొందరిని ఈ దోపిడీలో భాగస్వామ్యం చేశాడు. మార్చి 17న యజమాని ఆదేశాల మేరకు అజీముద్దీన్, ఖుస్రుద్దీన్ కూకట్‌పల్లికి వెళ్లి రూ. కోటి నగదు సేకరించారు. అనంతరం తిరిగి వస్తుండగా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని పిల్లర్ నం.836 వద్ద నిందితులు ముందుగా పన్నిన ప్రణాళిక ప్రకారం మిరప పొడి చల్లి వారిపై దాడి చేశారు. దీంతో వారు అదుపుతప్పి కింద పడగా నగదు సంచిని అపహరించి పరారయ్యారు. ఘటనను గమనించిన పోలీసు సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అక్కడ వదిలి వెళ్లిన హోండా యాక్టివా ఆధారంగా నిందితులను గుర్తించారు. దర్యాప్తులో నిందితులు లక్నోకు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకొని, శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు దాడి చేసి ఒమర్ షరీఫ్, సద్దాం, హమీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఖుస్రుద్దీన్‌ను కూడా అరెస్ట్ చేశారు. ఈ కేసులో చోటు, సల్మాన్, ఘౌస్, జీషాన్, జమ్ము పరారీలో ఉన్నారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. పోలీసులు రూ.77,78,195 నగదు, హోండా యాక్టివా, ఐదు మొబైల్ ఫోన్లు, లక్నోకు విమాన టికెట్లు స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ రితిరాజ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో, ఏసీపీలు, సీసీఎస్ బృందాల సమన్వయంతో ఈ కేసును వేగంగా ఛేదించడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

# రూ.2,540 కోట్ల రుణం సేకరించిన సర్కార్

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టర్, చివరి నెలలో భారీ రుణాన్ని సేకరిచింది. తాజాగా మంగళవారం మరో రూ.2,540 కోట్ల రుణాన్ని సమీకరించింది. రిజర్వ్ బ్యాంక్ నేతృత్వంలో జరిగిన బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ మొత్తాన్ని తీసుకుంది. ఈ రుణ మొత్తం రూ.2,540 కోట్లను 19 ఏండ్ల కాల పరిమితితో రూ.540 కోట్లు, 28 ఏండ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 30 ఏండ్ల కాలానికి మరో రూ.1,000 కోట్లు చొప్పున తీసుకుంది. దీంతో ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం చేసిన రుణం రూ.85,840 కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న వాటి కంటే సుమారు రూ.29 వేల కోట్లకుపైగా అదనపు అప్పులు సేకరించింది.




# వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగేలా నిజనిర్ధారణ కమిటీ

## ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, మార్చి 17,ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇండ్లు కోల్పోయిన బాధితులుదరికీ న్యాయం జరిగేలా నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు. మాజీకవిత తెలిపారు. మంగళవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకులు విశారదన్ మహారాజ్, జస్టిస్ చంద్రకుమార్, ఆర్మీ మేజర్ (రిటైర్డ్) మదనకుమార్ తో కలిసి ఆమె మాట్లాడారు. ఎలాంటి హెచ్చరిక లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి హెచ్చరిక లేకుండా నోటీసులివ్వకుండా వెలుగుమాట్ల లో 750 పేదకుటుంబాల ఇళ్లను కూల్చిచేయడం దారుణమన్నారు. కూల్చిన వారిలో 200 మందికి ఇళ్ల పట్టాలిస్తామని, మరో 110మందికి వాళ్ల గ్రామాల్లో ఇళ్లు కట్టుకొనేందుకు డబ్బులిస్తామని ప్రకటించడం ప్రజాస్వామ్యంలో ప్రజా పోరాటాలకు గెలుపు ఉంటుందని భావిస్తున్నట్టు తెలిపారు. అయితే, 750 ఇళ్లను కూల్చేసి, 410 మందికి మాత్రమే ఇళ్లు ఇస్తామనడం సరికాదన్నారు. చాలాముందికి న్యాయం జరగలేదన్నది స్పష్టంగా తెలుస్తున్నదన్నారు. దీనిపై విశారదన్ మహారాజ్ మొన్న ఖమ్మ వెళ్తే పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించాల్సిన అవసరం ఎందుకొచ్చిందన్నారు. కలెక్టర్, జాయింట్ కనెక్టర్ కనీసం అపాయింటిమెంట్ కూడా ఇవ్వలేదన్నారు. వెలుగుతుట్ల బాధితులపై ప్రభుత్వం ఏమాత్రం పారదర్శకంగా లేదన్నారు. ప్రభుత్వం బాధ్యాతయుతంగా మెలిగేలా చేసేందుకు, తాము కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కమిటీలో రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, ఆర్మీ మేజర్ (రిటైర్డ్) మదన్ కుమార్, ప్రొఫెసర్లు అనురాధ నాగం కుమార స్వామి, రామయ్య, న్యాయవాదులు సుంకర నరేశ్, శ్రవణ్ గౌడ్ , జర్నలిస్టులు తెలుగాణ విఠల్, ఆకాష్ గౌడ్, క్రాంతి ఉన్నారని వివరించారు. డిసెంబర్ 9 నాటికి పేదల ఇళ్లను పూర్తి చేస్తామని చెతున్నారని కానీ ఇప్పటివరకు వారు ఎక్కడ ఉండాలని ప్రశ్నించారు. ప్రొఫెసర్ కోదండరామ్, హంగోపాల్, ఆకసునూరి మురళి లాంటి వారు ఈ ఘటనపై స్పందించాలని కవిత కోరారు. విశారదన్ మహారాజు మాట్లాడుతూ వెలుగుమట్లలో కలెక్టర్ ద్వారా అక్కడి పేదల మీద ప్రభుత్వం విధ్వంసం సృష్టించిందన్నారు. విలువైన ఇళ్లను కూల్చేసి రూ.లక్షలే ఇస్తామనటం సరికాదన్నారు. ప్రభుత్వం సంపూర్ణంగా బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ కమిటీ రోజు ఖమ్మం వెళ్లి బాధితులను కలుస్తుందని, అధికారులతో మాట్లాడుతుందని తెలిపారు.రిటైర్డ్ జస్టిస్ చంద్రమమార్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు చెప్పినట్టుగా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించాడని, చట్టప్రకారమే ముందుకెళ్లాలని సూచించారు.

## విద్యార్థుల్లో నాయకత్వ, సాంకేతిక నైపుణ్యాల వృద్ధే లక్ష్యంగా

# నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో వినూత్న కోర్సులు

**హైదరాబాద్, మార్చి 17, ప్రభాతవార్త:** ఎంబిఏ విభాగం విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజి పలు వినూత్న, విభిన్న విద్యా, శిక్షణా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, అవగాహన, సాంకేతిక, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతోపాటు ఉపాధి అవసరాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతు న్నాయి. ఆర్థికరంగంపై లోతైన అవగాహన కల్పించేందుకు ఎంబిఏ విభాగం ఆధ్వర్యంలో వారంపాటు అడ్వాన్స్‌డ్ ఎక్సెల్ వర్క్‌షాప్‌ను నెల్లూరు నారాయణ కాలేజి నిర్వహించింది.



ఈ శిక్షణలో డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మోడలింగ్, డేటా విజువలైజేషన్ వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. డేటా అనలిటిక్స్‌పై అవగాహన కల్పించేందుకు రెండు వారా పవర్ బిఐ బూట్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ క్యాంపు ద్వాఆరా విద్యార్థులకు ఆధునిక డేటా విజువలైజేషన్ టూల్స్ ఉపయోగించే విధానాన్ని నేర్పించారు.

ఈ నైపుణ్యాలు కార్పొరేట్ రంగంలో విద్యార్థులు రాణించేందుకు అవసరమైనవిగా నిర్వాహకులు చెబుతున్నారు. అదేవిధంగా వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా సాఫ్ట్ స్కిల్స్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు.

పరిశ్రమలతో విద్యార్థులను అనుసంధానించేందుకు పలు సంస్థలతో ఎంవోయూలను నారాయణ ఇంజనీరింగ్ కాలేజి నెల్లూరు కుదుర్చుకుంది. కాలేజి నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల ఫలితంగా విద్యార్థులు పలు జాతీయ, రాష్ట్ర స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో ప్రతిభ చాటారు. కడప యోగి వేమన విశ్వ విద్యాలయం నిర్వహించిన వేమన మంథన్ , నంద్యాల ఆర్జిఎం ఇంజనిరింగ్ కాలేజి నిర్వహించి కైజెన్-2026 కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి బడ్జెట్ విశ్లేషణా పోటీల్లో విద్యార్థులు సర్టిఫికెట్లను సాధించారు. ఫైనాన్స్, హెచ్ఆర్, మార్కెటింగ్ తదితర ప్రత్యేకరంగాల్లో స్పెషలైజేషన్ వర్క్‌షాప్‌లను కళాశాల యాజమాన్యం నిర్వహించింది. ఇలా పలు వినూత్న కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థులు పరిశ్రమలతో అనుసంధానం అవడంతోపాటు వారిలో అనుభవాత్మక నైపుణ్యాలు పెంపొందించడంలో నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కాలేజి ముందంజలో నిలుస్తోంది.

